క్లుప్తంగా

ప్రకృతి వ్యవసాయంపై క్షేత్ర పరిశోధన


క్షేత్ర పరిశీలనలో కంపెనీ ప్రతినిధులు, అధికారులు

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు మండలం తాటిమాకులపల్లెలోని ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని విప్రో కంపెనీ ప్రతినిధులు పరిశోధన చేశారు. సదాశివనాయుడు ప్రకృతి వ్యవసాయ క్షేత్రంలో సమీకృత వ్యవసాయం, ఏటీఎం, ఏగ్రేడ్ పద్ధతుల్లో కూరగాయలసాగు, మినీ ఎన్‌పీఎన్ షాప్ నిర్వహణను క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయ దిగుబడి, ఆదాయం తదితర విషయాలను రైతును అడిగి తెలుసుకున్నారు. రసాయన వాడకాన్ని తగ్గించి ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అవలంభించాలని ప్రతినిధి అన్వర్ వివరించారు. కార్యక్రమంలో ఏపీసీఎన్ఎఫ్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వాసు తదితరులు పాల్గొన్నారు.

మామిడి రైతులను ఆదుకోండి

చిత్తూరు కార్పొరేషన్: రాష్ట్ర ప్రభుత్వం మామిడి, టమాటా రైతులను ఆదుకోవాలని సీపీఐ అనుబంధమైన రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జనార్దన్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉద్యానశాఖ ద్వారా రైతులకు సిరులు కురిపిస్తామంటూ చేస్తున్న వాగ్దానాలు కేవలం కంటితుడుపు చర్యగా ఉందన్నారు. చిత్తూరు జిల్లాలో మామిడి, టమాటా రైతాంగం గిట్టుబాటు ధర లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. జిల్లా అధికారులు తూతూమంత్రంగా సమావేశాలు నిర్వహించారే కానీ గిట్టుబాటు ధర కల్పించడంలో విఫలమయ్యారన్నారు. జిల్లాలో నిల్వ ఉన్న గుజ్జును ఎగుమతులకు అవకాశం కల్పించాలని పేర్కొన్నారు. ఈ సంవత్సరం తోతాపురికి గిట్టుబాటు ధర రూ.30 కల్పించాలని అందులో ప్రభుత్వ ప్రోత్సాహకం కిలోకు రూ.5 అందజేయాలన్నారు. టమాటాకు కిలో రూ.20 కొనుగోలు చేయాలని పేర్కొన్నారు. మార్కెట్ యార్డులో కమిషన్ 10% బదులు 4 శాతానికి పరిమితం చేయాలని డిమాండ్ చేశారు.

విత్తన వేరుశనగ ఎప్పుడిస్తారో?


దుక్కులు దున్నుతున్న దృశ్యం

గుడిపాల: ప్రభుత్వం విత్తన వేరుశనగ ఎప్పుడిస్తారోనని రైతులు ఎదురుచూస్తున్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో ఖరీఫ్ సీజన్‌కు ముందే మేలోనే విత్తన వేరుశనగ కాయలు అందించేవారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత జూన్ వస్తున్నా, ఇంకా సబ్సిడీ విత్తన కాయలు సరఫరాకు చర్యలు తీసుకోలేదని రైతులు అంటున్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో రైతులు సాగుకు సన్నద్ధమవుతున్నారు. వారం రోజులుగా చిత్తూరు నియోజకవర్గం వ్యాప్తంగా ఓ మోస్తరు వర్షం కురిసింది. ప్రభుత్వం మే మొదటి వారంలోనే సబ్సిడీ వేరుశనగ విత్తనాలు అందించాల్సి ఉండగా, నేటికీ పట్టించుకోవడం లేదు. దీంతో సాగుకు సమయమవుతుండడంతో రైతులు క్వింటాల్ వేరుశనగ విత్తనాలు రూ.12వేలతో తమిళనాడు ప్రాంతం వేలూరులో కొనుగోలు చేస్తున్నారు.

కరోనాపై అప్రమత్తత అవసరం

యాదమరి: కరోనా మహమ్మారితో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి డా.అనిల్ కుమార్ నాయక్ హెచ్చరించారు. ఆయన సంతగేటులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం క్షేత్ర స్థాయి వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. అనిల్ కుమార్ నాయక్ మాట్లాడుతూ అంతరించి పోయిందనుకున్న కరోనా వ్యాధి చాపకింద నీరులా మళ్లీ మన దేశంలోకి ప్రవేశించింది అని చెప్పారు. ఇప్పటికే మన రాష్ట్రంలో మూడు కేసులు నమోదయ్యాయని తెలిపారు. 2019లో ఈ మహమ్మారి వ్యాధి వలన అనేక కుటుంబాలను ఛిన్నాభిన్నం చేసి తీరని వ్యథను మిగిల్చిందని అన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ, హెల్త్ సూపర్ వైజర్లు, మహిళా ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈత.. ఆరోగ్య భద్రత

బావిలో ఈత కొడుతున్న యువకులు


- రోజూ ఉదయం ఈత కొడితే ఎన్నో ప్రయోజనాలు
- శరీరంలో అదనపు కొవ్వు తగ్గిపోతుంది
- శారీరక ఆరోగ్యం, మానసికోల్లాసానికి దోహదం

బైరాల: రోజూ ఉదయం రకరకాల వ్యాయామాలు చేసే బదులు కేవలం ఈత కొడితే చాలు. నిత్యం ఈత కొట్టడం వలన మన శరీరంలో అనేక వ్యాధులు నయమై శరీరాన్ని ధృడంగా ఉంచుతాయి. వ్యాయామంతోపాటు సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించే క్రీడల్లో ఈతకు మించింది మరొకటి లేదు. ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో గంట పాటు ఈత కొట్టడం వల్ల శరీరానికి ఎంతో మేలు చేకూరుతుంది. ఈత చక్కని శరీర ఆకృతిని ఇస్తుంది. శరీరంలో అదనపు కొవ్వు తొలగిపోతుంది. మానసిక అలసట తగ్గుతుంది. ఆస్తమా, నిద్రలేమి సమస్యలు కూడా మెరుగుపడతాయి. కీళ్ల నొప్పులు, రక్తపోటు, మధుమేహం, గుండె సంబంధిత వ్యాధుల నియంత్రణకు దీన్ని మించిన దివ్యఔషధం మరొకటి లేదనడంలో అతిశయోక్తి లేదు. గతంలో పట్టణాలకే పరిమితమైన స్విమ్మింగ్ పూల్స్(ఈత కొలనులు) నేడు మండల కేంద్రాల్లో సైతం కనిపిస్తున్నాయి. ఇక్కడ కూడా నిర్వాహకులు గంటకు రూ.100 వసూలు చేస్తున్నారు. ప్రస్తుతం వేసవి సెలవులు రావడంతో వ్యవసాయ బావులు, స్విమ్మింగ్‌పూల్ వైపు చిన్నారులు, యువకులు, పెద్దలు దృష్టి సారిస్తున్నారు. ఈతతో అనేక ఆరోగ్య ప్రయోజనాలు ముడిపడి ఉన్నందున వేసవిలో ఈత కొట్టేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఈత రాని వారు వ్యవసాయ బావుల్లో ట్రాక్టర్ ట్యూబ్‌లు, క్యాన్లు, తుండుల సాయంతో ఈత నేర్చుకుంటున్నారు. దీంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు వ్యవసాయ బావులు సందడిగా మారాయి.


స్విమ్మింగ్‌పూల్‌లో ఈత కొడుతున్న యువతి, యువకులు

సాధన చేస్తే అనేక లాభాలు

ఈయన ఒక క్రీడగా మార్చుకుని సాధన చేస్తే అనేక లాభాలు ఉన్నాయి. కాలానికి అనుగుణంగా ఎక్కువమంది ఈతకు ప్రాధాన్యం ఇవ్వాలి. నేర్చుకోవాలంటే క్రమశిక్షణ అవసరం. శరీరాన్ని పూర్తిగా ఆధీనంలోకి తీసుకున్న తర్వాతే మొదలు పెట్టాలి. మండల, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనవచ్చు. అందులో రాణించిన వారికి మంచి అవకాశాలు ఉంటాయి. అంతర్జాతీయ స్థాయిలో పేరు ప్రఖ్యాతులు సంపాదించవచ్చు.

బోలెడు ప్రయోజనాలు

చిన్నారులకు ఈత ఒక ఆట, పెద్దలకు మాత్రం అది ఆరోగ్య ప్రదాత. నిత్యం కనీసం అరగంట నుంచి 45 నిమిషాలు ఈత కొడితే ఎన్నో అనారోగ్య సమస్యల నుంచి బయట పడొచ్చు. ముఖ్యంగా ఊబకాయం సమస్య ఉండదు. మధుమేహం, బీపీతో బాధపడుతున్న వారికి ఈత ఎంతో మేలు చేస్తోంది. గుండె పనితీరును మెరుగుపరిచి గుండె జబ్బులను నియంత్రిస్తుంది. కండరాలను బలంగా ఉంచడంతో పాటు కీళ్ల సంబంధిత సమస్యల నుంచి ఉపశమనం కల్పిస్తుంది. విపత్కర పరిస్థితుల్లో నీటితో ఇబ్బందులు వచ్చినప్పుడు తమ ప్రాణాలను కాపాడుకోవడంతో పాటు ఇతరులను కూడా రక్షించవచ్చు.

జాగ్రత్తలు అవసరం

ఒక్క పక్క ఎండలు, మరో పక్క ఉక్కపోత. ఇంకేముంది నీరు కనిపిస్తే చాలా మంది పిల్లలకు ఎక్కడ లేని ఉల్లాసం ఉరకలేస్తుంది. నీటిని చూడగానే పట్టను పగ్గాలుండవు. ఈ ఉల్లాసంలో బావులు, చెరువుల ఎంత లోతున్నాయే ఆలోచించరు. ఈత వచ్చిన వారితోపాటు, రాని వారు కూడా సరదాగా దిగి ప్రాణాలు మీదకు తెచ్చుకుంటున్నారు. చిన్నారులను తల్లిదండ్రులు ఓ కంట కనిపెట్టుకోవాలి. ఈత నేర్చుకోవాలనుకున్న చిన్నారులు తల్లిదండ్రులను తోడుగా తీసుకెళ్లి నేర్చుకోవాలి. గ్రామాల్లో వ్యవసాయ బావులు 30 నుంచి 50 అడుగుల మేర లోతు ఉంటాయి. పిల్లల భద్రత దృష్ట్యా వారికి ట్యూబ్‌లు, తుండులు తొడిగించి బావిలోకి దించాలి.

ఎంతో దృఢంగా ఉంటారు



ఈత కొట్టడం ద్వారా శారీరకంగా, మానసికంగా ఎంతో ధృడంగా ఉంటారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ప్రతి క్రీడకు మంచి ఆదరణ లభిస్తోంది. ప్రధానంగా అంతర్జాతీయ స్థాయిలో ఈతకు మంచి ప్రాధాన్యత ఉంది. కేవలం చిన్నారులే కాకుండా పెద్ద వారు కూడా ఈత కొట్టడం ఎంతో మంచిది.
– దేవా, వ్యాయామ ఉపాధ్యాయుడు, బైరాల

విద్యార్థులు విజ్ఞానం పెంచుకోవాలి


శిక్షణ ఇస్తున్న రిసోర్స్ పర్సన్ రాజశేఖర్

బైరాల: గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతులు సద్వినియోగం చేసుకుని విద్యార్థులు విజ్ఞానాన్ని పెంచుకోవాలని స్థానిక గ్రంథాలయాధికారి సుజాత అన్నారు. గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా శనివారం విద్యార్థులకు క్విజ్, జీకే, పుస్తక పఠనం, కంప్యూటర్, పాటలు, వ్యాసరచన తదితర అంశాల్లో మెలకువలు నేర్పించారు. ఆమె మాట్లాడుతూ గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆ శిక్షణ శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సమ్మర్ క్యాంపులో పిల్లలకు మంచి కథలతో పాటు మానసిక ఉల్లాసం కోసం డ్యాన్స్, ఆటల పోటీలు, డ్రాయింగ్‌లు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ రాజశేఖర్ పాల్గొన్నారు.

నేడు నగరంలో ఉచిత కంటి వైద్య శిబిరం

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు నగరం రాములుగుడివీధిలోని శ్రీ జైన్‌సంఘ ప్రార్థన మందిరంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు సుభాష్ జైన్ తెలిపారు. ఉదయం 7 నుంచి 10 గంటల వరకు ఈశిబిరం ఉంటుందన్నారు. అరవింద్ ఐ ఆస్పత్రి వైద్యులచే పరీక్షలు చేసి ఉచితంగా ఆపరేషన్ చేయిస్తామని, దన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

శాస్త్రోక్తంగా ప్రదోషకాల పూజలు


అభిషేక పూజలు చేస్తున్న అర్చకులు

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవస్థాన అనుబంధ ఆలయమైన శ్రీమణికంఠేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రదోషకాల పూజలను శాస్త్రోక్తంగా జరిపించారు. ఉదయం మూలవిరాట్, నందీశ్వరుడికి ప్రత్యేక అభిషేకం, విశేష పూజలు చేశారు. భక్తులకు దర్శనం కల్పించి అర్చన చేశారు. భక్తులు స్వామి దర్శనార్థం క్యూకట్టారు. కర్పూర హారతులతో దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ పూజలో ఈవో పెంచలకిషోర్, సిబ్బంది కోదండపాణి, వాసు, అర్చకులు పాల్గొన్నారు.

వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి



తవణంపల్లె, గుడిపాల వైద్య శిబిరాల్లో సేవలందిస్తున్న వైద్యాధికారులు కేశవనారాయణ, రక్షిత

తవణంపల్లె: గ్రామీణ ప్రజలు వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి డాక్టర్ కేశవనారాయణ తెలిపారు. మండలంలోని పుణ్యసముద్రంలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ కేశవనారాయణ రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రజలు ఆరోగ్యసూత్రాలు పాటించాలని సూచించారు. ఆహార నియమాలు పాటించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. అనంతరం గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, సుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేయించి సూచనలు, సలహాలిచ్చారు. కార్యక్రమంలో ఏఎన్ఎం, ఆశాకార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

గుడిపాల: ప్రజల ఇంటి వద్దకే వైద్యం వస్తోందని బొమ్మసముద్రం ప్రాథమిక వైద్యాధికారి రక్షిత అన్నారు. మండలంలోని చామంతిపురంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా గర్భిణులు, బాలింతలు, కిషోర బాలికలకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. బీపీ, చక్కెరవ్యాధి గ్రస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఇందులో 63 మందికి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా శస్త్ర చికిత్సలు చేయించుకున్న వారికి ఇంటి వద్దనే ఆరోగ్య సేవలను అందించారు. వైద్య సిబ్బంది శ్రీలక్ష్మి, శశికల, రాధ, శశి పాల్గొన్నారు.

పచ్చదనం.. ఆహ్లాదం



గుడిపాల మండలంలోని జాతీయ రహదారి పచ్చదనంతో ఆహ్లాదంగా ఉంది. కార్లలో, ద్విచక్ర వాహనాల్లో వెళ్లేవారంతా ఈ పచ్చదనాన్ని ఆస్వాదిస్తున్నారు. చిత్తూరు-వేలూరు రోడ్డులో రోడ్డు పక్కన చింతచెట్ల వరుస ఉంది. కొత్తగా చింతపూత చిగురించడంతో ఎక్కడ చూసినా పచ్చదనం తెలుస్తుంది. దీంతోపాటు కొద్దిపాటి వర్షాలు కురవడంతో ఆ చెట్లకు మరింత శోభ వచ్చింది. దీంతో భలే పచ్చగా ఉందిరో అంటూ సెల్ఫీలు దిగుతున్నారు.
– గుడిపాల

పశు వైద్యశాలకు నీటి కష్టాలు



గుడిపాల: మండలంలోని బొమ్మసముద్రం పశు వైద్యశాలలో నీటి కష్టాలు తీవ్రంగా ఉండడంతో పశువులకు వైద్యం అందించడానికి కూడా వైద్యాధికారులు అష్టకష్టాలు పడాల్సిన పరిస్థితి నెలకొంది. బొమ్మసముద్రం ప్రాంతంలో సుమారు 50 గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాల్లోని రైతులకు సంబంధించిన పాడిపశువులు, మేకలు, గొర్రెలకు చికిత్సలు అందించడానికి వీలుగా బొమ్మసముద్రం హైస్కూల్ రోడ్డు సమీపంలో పశువైద్యశాలను ఏర్పాటు చేశారు. అయితే ఈ పశువైద్యశాల పక్కనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. అయితే బొమ్మసముద్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి పశువైద్యశాలకు తాగునీరు వచ్చేది. కొద్ది నెలల క్రితం రాజకీయ నాయకుల జోక్యంతో ఆస్పత్రి వారు పశువైద్యశాలకు వస్తున్న నీటి సరఫరాను నిలిపివేశారు. ఎదకు వచ్చిన పశువులకు టీకాలు వేయాలన్నా నీరు తప్పనిసరి కావడంతో పక్కనే ఉన్న మిల్క్ బల్క్‌సెంటర్ నుంచి నీరు తెచ్చుకునేవారు. అయితే వారు కూడా అభ్యంతరం తెలపడంతో నీటికి అష్టకష్టాలు పడక తప్పలేదు. ఈ విషయాన్ని డాక్టర్ అనిజ గతంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో తెలిపినా ప్రజాప్రతినిధులు, అధికారులు ఎవ్వరూ పట్టించుకోలేదు. సంబంధిత అధికారులు స్పందించి పశువైద్యశాలకు నీటిసమస్యను పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని రైతులు కోరుతున్నారు.

ద్విచక్ర వాహనదారుడికి గాయాలు

బంగారుపాళెం: మండలంలోని పాలమాకులపల్లె పిళ్లారిగుండు వద్ద బెంగళూరు-చెన్నై జాతీయ రహదారిపై శనివారం జరిగిన ప్రమాదంతో ద్విచక్ర వాహనదారుడు తీవ్రంగా గాయపడ్డాడు. మండలంలోని బోడబండ్ల గ్రామానికి చెందిన వెంకటేష్ ద్విచక్ర వాహనంపై పలమనేరు నుంచి బంగారుపాళ్యానికి బయల్దేరారు. పిళ్లారిగుండు వద్ద జాతీయ రహదారి పక్కన అండర్ గ్రౌండ్ కేబుల్ వైర్లు వేసేందుకు గొయ్యి తీసి మట్టిని కుప్పగా వేశారు. ప్రమాదవశాత్తు మట్టికుప్పను ఢీకొని రహదారిపై పడ్డాడు. దీంతో తీవ్రగాయాలయ్యాయి. గాయపడి అపస్మార కస్థితిలో ఉన్న వ్యక్తిని స్థానికులు, ప్రయాణికులు రోడ్డు పక్కకు తీసుకువచ్చి బంగారుపాళెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కిశోరి వికాసంతో ఉజ్వల భవిష్యత్


కిశోర బాలికలకు సూచనలిస్తున్న సూపర్‌వైజర్ స్వర్ణలత

గుడిపాల: యుక్త వయసులో ఉన్న బాలికల ఉజ్వల భవిష్యత్‌కు కిశోరి వికాసం ఎంతగానో దోహద పడుతుందని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ స్వర్ణలత, వసంతాపురం పంచాయతీ కార్యదర్శి సుందరేష్ అన్నారు. మండలంలోని మరకాలకుప్పం, పశుమందలో శనివారం వేసవి సెలవుల్లో భాగంగా 11 నుంచి 18 ఏళ్ల కిశోర బాలికలకు పశుమంద, వారు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ బాలబాలికల్లో కౌమార దశలో వచ్చే మార్పులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వారికి వివరించారు. పౌష్టికాహారం వలన కలిగే లాభాల గురించి తెలపడంతోపాటు బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాల గురించి వారికి విపులంగా వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

సబ్సిడీ రుణాల దరఖాస్తుకు నేడు ఆఖరు

యాదమరి: ముస్లిం మైనారిటీలకు ప్రభుత్వం అందించే రాయితీ రుణాల కోసం దరఖాస్తుల స్వీకరణ నేటి(ఆదివారం)తో ముగియనుందని ఎంపీడీవో వేణు చెప్పారు. ఆయన తన కార్యాలయంలో శనివారం మాట్లాడుతూ మండలానికి పది యూనిట్లు మంజూరు కాగా ఇప్పటివరకు కేవలం ఐదుగురు మాత్రమే దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. వ్యవసాయం, అనుబంధ రంగాలు, రవాణా, పరిశ్రమలు, సేవా, వ్యాపార రంగాల్లో స్వయం ఉపాధి పొంది ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి ప్రభుత్వం రుణాలు మంజూరు చేస్తుందన్నారు. ఈ పథకం ద్వారా మైనారిటీలు రూ.1 లక్ష నుంచి రూ.8 లక్షల వరకు రుణం పొందవచ్చని చెప్పారు. ఆసక్తి కలవారు ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ఉయ్యాల చింతలో గొడవ

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరం ఉయ్యాల చింత ప్రాంతంలో శనివారం రాత్రి గొడవ చోటుచేసుకుంది. హనుమాన్ జయంతి సందర్భంగా ఊరేగింపులో మాపాక్షికి చెందిన 30 మందికి వీరంగం సృష్టించారు. దీంతో గ్రామ పెద్దలు అక్కడ గొడవ కాకుండా సర్ది చెప్పి పంపించారు. శనివారం మాపాక్షికి చెందిన కొందరు ఉయ్యాల చింతలోని కొందరు పిల్లలను చితక బాదారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు గొడవకు కారకులైన వారిని అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు.

ఘనంగా వినాయకస్వామి కుంభాభిషేకం

గుడిపాల: మండలంలోని రామభద్రాపురం పంచాయతీ చుక్కావారిపల్లెలో శనివారం సెల్వ వినాయక స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా కుంభాభిషేకం ఘనంగా నిర్వహించారు. ఉదయం హోమం, పూర్ణాహుతితో ప్రారంభమై వినాయక స్వామికి అభిషేకం, కుంభాభిషేకం జరిగింది. అనంతరం పొన్నియమ్మ దేవస్థానంలో అమ్మవారికి అభిషేకం, అలంకరణ నైవేద్యం సమర్పించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. సాయంత్రం వినాయకస్వామి వారి గ్రామోత్సవంతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.


ఊరేగింపుగా ఆలయం వద్దకు వస్తున్న గ్రామస్తులు


హోమం నిర్వహిస్తున్న అర్చకులు


అన్నదానం చేస్తున్న గ్రామస్తులు